క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: గ్రామీణస్థాయి క్రీడాకారులకు ప్రోత్సాహం అందించి క్రీడల్లో మరింతగా రాణించేలా చీఫ్ మినిస్టర్ కప్–2023 పేరులో ఆటలను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. సోమవారం నాట్కో పాఠశాల క్రీడామైదానంలో ఆయన మండల స్థాయి క్రీడలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... క్రీడాకారులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో మరింత నైపుణ్యం పెంచుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. యువత క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో పోలీసు, ఆర్మీతో పాటు పలు రంగాల్లో సులువుగా ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. ముఖ్యంగా క్రీడలతో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చక్కని శారీరక దారుఢ్యాన్ని పెంచుకుంటారని వివరించారు. అనంతరం స్పెషల్‌గ్రేడ్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన కొత్తూరు మున్సిపల్ కమిషనర్ వీరేందర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత, కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ ఎంపీపీ శోభ, తహసీల్దార్ రాములు, ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు, సీఐ బాలరాజు, నాయకులు రవీందర్, కోస్గి శ్రీనివాస్, రమేష్, యాదగిరి, రాఘవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలు ప్రారంభం

షాద్‌నగర్: పట్టణంలోని మినీ స్టేడియంలో సోమవారం సీఎం కప్ ఆటల పోటీలను ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఆటల పోటీలను నిర్వహిస్తుందన్నారు. క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో క్రీడామైదానాలను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, ఎంఎస్ నట్‌రాజన్, విశ్వం, పావని, నర్సింహ్మా, చింటు, యుగేందర్, శంకర్, ఈశ్వర్ రాజు, కమిషనర్ వెంకన్న, తహసీల్దార్ గోపాల్, ఎంపీడీఓ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఇతర ప్రజాప్రతినిధులు

సద్వినియోగం చేసుకోవాలి

నందిగామ: క్రీడాకారులను బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. నందిగామలో సీఎం కప్ మండలస్థాయి క్రీడాపోటీలను ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సోమవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడాపోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేవలం చదువు మాత్రమే కాకుండా క్రీడలపై సైతం దృష్టి సారించాలని, క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రియాంక, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, తహసీల్దార్ రహ్మాన్ ఖాన్, ఎంపీడీఓ బాల్‌రెడ్డి, ఏపీఎం యాదగిరి, ఎంపీఓ గిరిరాజ్, ఎంపీటీసీలు దేపల్లికుమార్, చంద్రపాల్ రెడ్డి, నేతలు సత్తిపండు, బాల్‌రెడ్డి పలు గ్రామాలకు చెందిన క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

ఫరూఖ్‌నగర్ మండలంలోని బూర్గులలో రూ.2.15కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామంలో రూ.85లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, రూ.22లక్షలతో నిర్మించిన రైతువేదిక, రూ.30లక్షలతో నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంకు, రూ.20లక్షలతో నిర్మించిన పాఠశాల భవనం, రూ.12.60లక్షలతో నిర్మించిన వైకుంఠధామాలను ప్రారంభించారు. అలాగే, రూ.15లక్షలతో కమ్యూనిటీ భవనం, రూ.10లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

షాద్‌నగర్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సూచించారు. సోమవారం షాద్‌నగర్ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. పంటలకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నె కవిత, పీఏసీఎస్ చైర్మన్ బక్కన్న యాదవ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, నట్‌రాజన్, ఏడీ రాజారత్నం, ఏఓ నిషాంత్, పీఏసీఎస్ సీఈఓ రఘునందన్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం

కేశంపేట: మండలంలోని చౌలపల్లి, మీనమోనిపల్లిలో అండర్‌డ్రైనేజీ పనులను సర్పంచ్ వీరేశ్ సోమవారం ప్రారంభించారు. రూ. 6లక్షల నిధులతో నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్సమ్మ, వార్డు సభ్యులు శోభ, మల్ల య్య, చంద్రయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌కు చెందిన పలువురు విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. సోమవారం హైదరాబాద్‌లోని టోలిచౌకిలో ఆల్‌స్టైల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వాహకులు ఏర్పాటు చేసిన స్టేట్‌లెవల్ కుంగ్‌ఫూ పోటీల్లో పాల్గొని సత్తా చాటినట్లు కరాటే మాస్టర్ శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విభాగాల్లో పాల్గొని పతకాలు సాధించినట్లు వివరించారు. విద్యార్థులకు నిర్వాహకులు మెమోంటోలతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు.

యువతను ప్రోత్సహించేందుకే సీఎం ట్రోఫీ

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: యువతను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం సీఎం ట్రోఫీని నిర్వహిస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని చందానగర్‌లో సోమవారం సీఎం ట్రోఫీలో భాగంగా వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికితీయడానికి క్రీడలు ఎంతో ఉపయోగపడు తాయన్నారు. పోటీల్లో గ్రామాల్లోని క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, వైస్ ఎంపీపీ మమత, సర్పంచ్ సత్తమ్మ, ఎంపీటీసీ శ్రీనివాస్, ఎంపీడీఓ సంధ్య, ఎంఈఓ వెంకటయ్య, ఎంపీఓ వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు రత్నం, కుమార్, నాయకులు జయవంత్, ఆంజనేయులు, రవి పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

శంషాబాద్ ఏసీపీ పరిధిలోకి నందిగామ, కొత్తూరు ఠాణాలు

నందిగామ/కొత్తూరు: శంషాబాద్ ఏసీపీ పరిధిలోకి తాజాగా నందిగామ, కొత్తూరు పోలీస్ స్టేషన్లు చేరాయి. ఇంతకాలం షాద్‌నగర్ ఏసీపీ పరిధిలో ఉన్న ఈ రెండు ఠాణాలను పాలనా సౌలభ్యం దృష్ట్యా శంషాబాద్ ఏసీపీ పరిధిలోకి చేరుస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం శంషాబాద్ ఏసీపీ పరిధిలో షాపూర్ (శంషాబాద్) ఆర్జీఐ, నందిగామ, కొత్తూరు పోలీస్ స్టేషన్లు ఉన్నాయి.

సీఎం కప్ పోటీలు ప్రారంభం

శంకర్‌పల్లి: క్రీడలతో దేహదారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కల్గుతోందని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, జెడ్పీటీసీ గోవిందమ్మ పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే సీఎం కప్ పోటీలు మండలంలోని మోకిల క్రీడా మైదానంలో సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. యువతీ యువకులు క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అథ్లెటిక్స్ తదితర క్రీడాపోటీలను నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, సీఐ ప్రసన్న కుమార్, కమిషనర్ జ్ఞానేశ్వర్, వైస్ చైర్మన్ వెంకట్ రాంరెడ్డి, సర్పంచ్‌లు సుమిత్రా రెడ్డి, శ్రీనివాస్, ఎంపీటీసీలు సరిత, నాగేందర్ నాయకులు నర్సింహా, సుధాకర్, ఖాదర్‌పాషా పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం

ఎంపీపీ రవీందర్ యాదవ్

కేశంపేట: ఆటలు ఆడడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం కల్గుతోందని ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడాపోటీలను సోమవారం ఎంపీపీ రవీందర్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో యువతకు అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో పోటీలను నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను గుర్తించి జాతీయ స్థాయిలో రాణించే విధంగా వారికి అవకాశాలను కల్పించడం సీఎం కప్ ఉద్దేశమని ఆయన అన్నారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల , వివిధ గ్రామాల సర్పంచులు వెంకట్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణయ్య, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, తహసీల్దార్ అజీంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, మండల విద్యాధికారి మనోహర్, ఏపీఎం భగవంతు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, అంజిరెడ్డి, ధన్‌రాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటలపోటీలతో నైపుణ్యం వెలికితీత

కొందుర్గు: క్రీడాపోటీలతో గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యం వెలికితీయవచ్చని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. సోమవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో ఆయా మండలాల ఎంపీపీలు పోతురాజు జంగయ్య, నస్వల్లి యాదమ్మ జ్యోతి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆంజనేయులు మాట్లాడారు. క్రీడాకారులు సంయమనంతో క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమేనని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌కుమార్, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, ఎంపీటీసీ ఇస్తారమ్మ, ఎంపీఓ లాలయ్య, జిల్లేడ్ చౌదరిగూడలో తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీఓ మహేష్‌బాబు పాల్గొన్నారు.

అంబలితో అనారోగ్య సమస్యలు దూరం

చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: పౌష్టిక విలువలతో కూడిన అంబలిని సేవించడం ద్వారా అనారోగ్య సమస్యలు దూరమవుతాయని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని చిన్నచిల్కమర్రి, గంట్లవెల్లి, చిల్కమర్రి, నేరెళ్లచెరువు, కాశిరెడ్డిగూడ గ్రామాల్లోని అమృతపానం అంబలి కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో అంబలి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాగి, అరికెలు, సామ లు, కొర్రలు, అండు కొర్రలు, జొన్నలతో కూ డిన మిశ్రమాన్ని అంబలిగా తయారు చేసి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

గొర్రెల పథకంతో లబ్ధి

పశువైద్యాధికారి దేవిరెడ్డి

మొయినాబాద్ రూరల్ : ప్రభుత్వం అమలు చేస్తున్న రెండవ విడత గొర్రెల పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి దేవిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముర్తుజాగూడలో సోమవారం గొర్రెల పంపిణీపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండవ విడత అర్హులైన సభ్యులు కులధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లు అందజేయాలన్నారు. 20 గొర్రెలు, ఒక గొర్రె పోటేలను ఇవ్వడం జరుగుతుందన్నారు. వీటికి ఫుల్ ఇన్సూరెన్స్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భీం, రైతులు బాబు, కృష్ణ, యాదయ్య, అంజయ్య పాల్గొన్నారు.

గద్దర్ ఆటా..పాట..

కొందుర్గు: పీపుల్స్ మార్చ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం గుర్తించిన ప్రదేశంలో కాంగ్రెస్ నాయకులు బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో గద్దర్ తన ఆటా..పాటలతో ప్రజలను ఆకట్టుకున్నారు. తెలంగాణ గోసను తన పాటల ద్వారా వినిపించారు. బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసిందేమిలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే బతుకులు మారుతాయని అన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కుతో జీవితాలను మార్చుకోవాలని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు.



బహిరంగ సభలో పాడుతున్న గద్దర్